క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


మారెమ్మవ్వ

ఆస్పరి: స్థానిక మారెమ్మవ్వ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు గోవిందు ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్ఐ అశోక్‌కు సన్మానం


ఎస్ఐను సన్మానిస్తున్న క్రీడాకారులు, సర్వీస్ సొసైటీ సభ్యులు

వెల్దుర్తి: ఈనెల 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎస్ఐ అశోక్‌ను స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులు, క్రీడాకారులు శ్రీకాంత్, ప్రభాకర్ మంగళవారం సన్మానించారు. స్టేషన్‌లో ఎస్ఐను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఎస్ఐ మాట్లాడుతూ అవార్డు బాధ్యతలు పెంచిందన్నారు. యువత దురలవాట్లు మాని చదువు, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, తల్లితండ్రుల సేవలో తరించాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి మంచం విరాళం


సూపరింటెండెంట్‌కు మంచాన్ని విరాళంగా అందిస్తున్న దాతలు

వెల్దుర్తి: పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు, ఎల్లకృష్ణ సోదరులు మంగళవారం స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రికి మంచం (బెడ్) విరాళంగా అందించారు. ఈ మేరకు మంచాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలచంద్ర రెడ్డి సమక్షంలో ఇచ్చారు. దాతలను సూపరింటెండెంట్ అభినందించారు. తమ తల్లితండ్రులు పెద్ద కృష్ణ, పుల్లమ్మల స్మారకార్థం, వైద్య సేవలకు అవసరమైన మంచాన్ని విరాళంగా అందించినట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో నందీశ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఉద్యోగావకాశాలు


జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన యువకులు

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 48 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. వీరిలో ఇంటర్వ్యూ ఆధారంగా 16మంది ఉద్యోగ అవకాశాలు పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాదురి, నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీలో 10 మంది, స్పందన కంపెనీలో ముగ్గురు, నవ భారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలో ముగ్గురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, కోఆర్డినేటర్ అల్తాఫ్, నాన్‌టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, స్కిల్ ట్రైనర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దహ్యాటలో సీసీ రోడ్డు పనులు


సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామంలో ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి ఆదేశాలతో జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ సహకారంతో రూ.5 లక్షల జెడ్పీ నిధులతో మంగళవారం సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ హసన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, ఎంపీటీసీ శివన్న , దర్గప్ప తదితరులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పనుల్లో భాగంగా వీరేశ్ ఇంటి నుంచి భద్ర ఇంటి వరకు అక్రమ కట్టడాలు, రాళ్లను తొలగించి చదును చేశారు. గ్రామపెద్దలు ముద్దప్ప, పంపారెడ్డి, శేఖర్, నాగప్ప, ఆటో మల్లి, పెద్యాట మల్లయ్య, వీరేశ్, భద్ర, మరిస్వామి పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

హాలహర్వి: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ శివశంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని బిలేహాల్, విరుపాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కొజన్న, శనగ పంటలను సందర్శించి రైతులకు వ్యవసాయ సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు వెంకటలక్ష్మి, రాజేంద్ర, రైతులు పాల్గొన్నారు.

రైతన్నకు నిరాశ

- పప్పుశనగ పంటలను దెబ్బతీసిన తెగుళ్లు
- తగ్గిపోయిన దిగుబడి
- రోజురోజుకు తగ్గుతున్న ధర
- ఆందోళనలో అన్నదాతలు


అమ్మకానికి సిద్ధంగా వుంచిన పంట


నూర్పిడి కోసం నిలువ చేసిన పంట

మద్దికెర : పప్పుశనగ ధర రోజుకి రోజుకి తగ్గుతుండంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆశించిన మేర దిగుబడులు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ఆపై పడిపోతున్న ధరలు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి. తమ పరిస్థితి అమ్మబోతే అడివి కొనబోతే కొరివిలా తయారైందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడిపై తెగుళ్ల ప్రభావం

నియోజకవర్గంలో దాదాపు 35 వేల ఎకరాలలో పప్పుశనగ పంటలు సాగు చేశారు. మద్దికెరలో 20 వేలు, తుగ్గలి 7 వేలు, పత్తికొండ 7 వేలు, వెల్దుర్తి 500 ఎకరాలు, కృష్ణగిరి 400 ఎకరాల్లో పప్పుశనగ పంట వేశారు. సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందకపోయినా పదును దాటి పోతుందని బయట మార్కెట్లో క్వింటాలు రూ. 6,500 వేలు చొప్పున విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేశారు. మంచి దిగుబడులు వస్తాయని ఎన్నో ఆశలతో వున్న తరుణంలో మొగిలి (ధూమ్ తెర), తెగుళ్ల వల్ల పంటలు వల్ల నాశనమయ్యాయి. దీంతో ఎకరాకు 8 నుంచి 10 బస్తాల వరకు దిగుబడి వస్తుందనుకుంటే కేవలం 3 నుంచి 5 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. కొన్ని గ్రామాలలో పూర్తిగా దిగుబడి తగ్గిపోయింది.

భారీగా తగ్గిన ధర

తగ్గిన దిగుబడులకు తోడు ధరలు తగ్గు ముఖం పట్టడంతో కొంత మంది రైతులు పొలాల్లోనే విక్రయిస్తుండగా మరి కొందరు మంచి ధర కోసం వేచి చూస్తున్నారు. పదిహేను రోజుల క్రితం క్వింటాల్ ధర రూ.6,500 నుంచి రూ.6 వేలు వుండేది. ప్రస్తుతం రూ.5 వేలు నుంచి రూ.5,300 వుంది. పంట దిగుబడి తగ్గినపుడే ధర కూడా పడిపోతుందని వాపోతున్నారు.

తూకాల్లో మోసం..

గ్రామీణ ప్రాంతాలలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని జీరో వ్యాపారం చేస్తూ తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు వ్యాపారులు. విత్తనాల్లో తేమ శాతం అంటూ ఒక్కోసారి తూకాల్లో కేజీలకు కేజీలు దోచేస్తున్నారు. క్వింటాలుకు 4 నుంచి 5 కేజీలు అదనంగా తూకం వేస్తున్నారు. దీంతో రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయినా ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా గిట్టుబాటు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

రైతులు అప్పులపాలు

ప్రధాన పంటలైన వేరుశనగ, పప్పుశనగ పంటలు సాగుచేయాలంటే ఎకరా పొలం సేద్యానికి విత్తనాలు, మందులు, ఎరువులు, కూలీల ఖర్చులు కలిపి దాదాపు రూ. 15 వేల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడి మాత్రం ఎకరాకు 4 బస్తాలు మించి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది కూలీల ఖర్చులు పెరిగి పోవడంతో తగ్గిన దిగుబడులు, ధరలు తగ్గడంతో వ్యవసాయం భారంగా మారుతోందని, కనీసం పెట్టుబడులు రైతులకు కూడా చేతికి రాక అప్పుల పాలు కావాల్సివస్తోందని వాపోతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



14 ఎకరాల్లో పప్పు శనగ పంట వేశాం. ఎకరాకు కేవలం 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ధరలు చూస్తే రోజుకు రోజుకు పడి పోతున్నాయి. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. – పరుశురాముడు, మద్దికెర

రైతుకు ఎప్పుడూ గడ్డు కాలమే



పంటలు పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అన్ని విధాల రైతులు నష్టపోతున్నారు. రైతులు గడ్డు పరిస్థితి ఎదుర్కొవలసి వస్తోంది. నాకు మూడు ఎకరాలకు కేవలం 12 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. భారీగా పెరిగిన పెట్టుబడులతో సేద్యం గిట్టుబాటు కాకుండా పోతుంది. ప్రభుత్వం రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి.
– తిరుమలేశు, ఎం.అగ్రహారం, మద్దికెర మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రభుత్వం పప్పుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. లేకుంటే వ్యవసాయం భారంగా మారి అన్నదాతలు సేద్యం వదులుకోవాల్సి వస్తుంది. విత్తనాల నుంచి పంట చేతికొచ్చేవరకు ఇబ్బందులు పడతాం. ధరలు చూస్తే తక్కువగా ఉంటున్నాయి. –హనుమంతు,రైతు,మద్దికెర

రోడ్లను బాగు చేసేదెప్పుడు?


బైలుపత్తికొండ అప్రోచ్ రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: సంక్రాంతి పండుగలోపు గుంతలు పడ్డ రోడ్లును బాగు చేస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసిందే కాని ఆచరణలో చూపడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. మండలంలోని కైరుప్పల గ్రామం నుంచి కలపరి, బైలుపత్తికొండ, గార్లపెంట మీదుగా ఆదోనికి వెళ్లే అప్రోచ్ రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు. మంగళవారం బైలుపత్తికొండ అప్రోచ్ రోడ్డుపై సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఆపార్టీ నాయకులు విరుపాక్షి, రాజశేఖర్, సుంకన్న, తిక్కయ్య, దేవేంద్ర, బడేసాహెబ్, మల్లన్న, వెంకటేష్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు నిరసన తెలిపారు. గిడ్డయ్య మాట్లాడుతూ వెంగళాయిదొడ్డి చెరువు నుంచి ఇసుక ట్రాక్టర్లు ఈగ్రామాల రోడ్లపై వెళ్తుండడం వల్ల మోకాళ్లోతు గుంతలు పడ్డాయన్నారు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే ఎన్నో అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు అధ్వానంగా ఉండడంతో ఆర్‌టీసీ అధికారులు బస్సులు కూడా నడపడం లేదన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం


కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ హరిత

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో ప్రభుత్వ మద్దతుధరకు కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం గ్రామ సర్పంచు హరిత ప్రారంభించారు. ఏడీఏ విజయమోహన్, ఏఓ వెంకట్రాముడు మాట్లాడుతూ 2024–25 ఖరీఫ్ పంట కాలంలో కంది సాగుచేసి పంట నమోదు చేసుకుని ఈ–కేవైసీ చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తరువాత ప్రభుత్వ మద్దతు ధరకు కందులను విక్రయించవచ్చునన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైందని, మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు రైతు సేవా కేంద్రాలను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కందుల క్వింటానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.7550కి పత్తికొండ డీసీఎంఎస్ కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద సాంబశివారెడ్డి, పత్తికొండ ఏఈఓ శ్రీనాథ్, డిసిఎంఎస్ సిబ్బంది మల్లికార్జున , రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని నల్లచెలిమల రైతు సేవా కేంద్రంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించినట్లు ఏఓ సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. కంది పంట మద్దతు ధర రూ.7,550గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ సవారమ్మ, ఏఈఓ రంగన్న, వీఏఏలు అబ్దుల్‌సలాం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చుతున్నారు

సాక్షి ఎఫెక్ట్


గుంతలను తారుతో పూడ్చివేస్తున్న దృశ్యం

హొళగుంద: హొళగుంద–సుళవాయి ఆర్‌అండ్‌బీ రోడ్డులో చేపట్టిన ప్యాచ్ వర్క్‌లో భాగంగా కొన్ని చోట్ల అసంపూర్తిగా వదిలేసిన గుంతలను తారుతో పూడ్చివేసే పనులను మంగళవారం చేపట్టారు. ఆలూరు నుంచి సుళువాయి మీదుగా హొళగుంద వరకు 22 కి.మీకు గాను రూ.10 లక్షలు ప్యాచ్ వర్క్‌కు నిధులు కేటాయించారు. అయితే హొళగుంద సమీపంలో పెద్ద పెద్ద గుంతలను పూడ్చి పలుచోట్ల కంకర, తారు వేయకుండా వదిలేశారు. దీంతో ఆగతుకులు, గుంతల్లో వాహనాలను నడిపేందుకు ఇబ్బందికరంగా మారింది. దీనిపై ఈ నెల 23న 'సాక్షి'లో 'అసంపూర్తిగా ప్యాచ్ వర్క్'అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు చిన్న గుంతలకు కూడా ప్యాచ్ చేసి పూర్తి స్థాయిలో పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

తపాలా సేవలపై అవగాహన కల్పించాలి


రీజినల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగా నాయక్

ఆలూరు రూరల్: తపాలా శాఖలో అమలవుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రీజినల్ పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్ పోస్టల్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన ఆలూరు పోస్టాఫీసును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పొదుపు ఖాతాలు, ఐపీపీబీ, పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ బీమా పాలసీలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ఆలూరు పోస్టుమాస్టర్ నాగరాజు, సిబ్బంది హరికృష్ణ, సుధాకర్ ఉన్నారు.

ఎంఆర్‌పీఎస్ నాయకుల సంబరాలు

ఆస్పరి: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల ఎంఆర్‌పీఎస్ నాయకులు మంగళవారం ఆస్పరిలో సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండ్ నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఫిబ్రవరి 7వ తేదీన చలో హైదరాబాదును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సంజప్ప, రామాంజినేయులు, చిన్న సంజన్న, నాగరాజు పాల్గొన్నారు.

పుల్లాపురంలో 'పొలం పిలుస్తోంది'

దేవనకొండ: మండలంలోని పుల్లాపురం గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయాధికారి వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగార రైతులకు సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రంగన్న, వీఏఏ సలీం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించండి

చిప్పగిరి: మండలంలోని అయా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ అల్లాబకాష్ మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ సంజన్న, ఈఓపీఆర్డీ బాలన్న పాల్గొన్నారు.

'గురుకులం' తనిఖీ


నీటిలో లార్వాపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

వెల్దుర్తి: స్థానిక అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకులాన్ని మంగళవారం జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు తనిఖీ చేశారు. ఇటీవల గురుకులం విద్యార్థినికి డెంగీ లక్షణాలు బయటపడడంతో నూకరాజు మంగళవారం గురుకులాన్ని చేరుకుని పరిశుభ్రతపై ప్రత్యేక పరిశీలన చేశారు. తాగునీరు, వాడుకునే నీటి ట్యాంకులు, కొళాయిల వద్ద పరిశీలించారు. విద్యార్థినులతో సమావేశమై పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంచారు. డ్రైనేజీలను, గురుకులం పరిధిలోని వెనుక పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ప్రిన్స్‌పాల్ లక్ష్మీ ప్రసూనను ప్రశ్నించారు. ఆయన వెంట సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్, ఏఎన్ఎమ్‌లు బుచ్చమ్మ, మునెమ్మ ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఆస్పరి: విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గీతావాణి సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. మండలంలోని ముత్తుకూరు సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి జంప్లానాయక్‌కు సూచించారు.

హత్య కేసు ముమ్మర దర్యాప్తు

ఆలూరు: అరికెర గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బండారి కురుబ ఈరన్న హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గ్రామానికి చెందిన గాదిలింగప్ప, గోపి, రామదాస్ తదితరులు తన భర్తను ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు వదులుకోవాలని బెదిరించి హత్యా చేశారని మృతుడి భార్య నాగలక్ష్మి, తల్లి ఎల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పత్తికొండ డీఎస్పీ బి. వెంకటరామయ్య ఆదేశాల మేరకు ఆలూరు సీఐ వెంకటచలపతి సమగ్రంగా విచారణ చేపడుతున్నారు. ఆధారాల కోసం కోసం నిందితుల ఫోన్‌కాల్ డేటాను పరిశీలిస్తున్నారు.

వాహనాల తనిఖీ

హాలహర్వి: మండల పరిధిలోని క్షేత్రగుడి చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం ఎస్ఐ చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాహనాదారులకు పలు సూచనలిచ్చారు. కార్లలో ప్రయాణించేవారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, మోటార్‌సైకిళ్లపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు.

పాఠశాలల వద్ద అపరిశుభ్రం చేస్తే చర్యలు

హొళగుంద: పిల్లలు చదువుకునే పాఠశాలల వద్ద ఎవరైన అపరిశుభ్రం చేయడం, జంతువుల కళేబరాలను వేయడంలాంటి పనులు చేస్తే వారి పై పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హొళగుంద గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఈబీసీ కాలనీ, ఇతర వీధుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. అదే విధంగ కొందరు స్థానిక సిద్దనగౌడ్ తాత గుడి, నేతాజీ పాఠశాల పరిసరాల్లో చనిపోయిన పందులు, కుక్కల కళేబరాలను వేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులతో వాటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

హొళగుంద: ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కురువ బండారి ఈరన్నను హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ కురువ సంఘం నాయకులు లింగంపల్లి మౌనేష్, శంభులింగ, హెబ్బటం శ్రీను, నెరణికి రవి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రూ.12 వేల జీతం కోసం ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను అతి కిరాతకంగా హత్య చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలతో హత్యలు, దాడులు అధికమయ్యాయన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు.

పప్పుశనగకు నష్ట పరిహారం ఇవ్వాలి

మద్దికెర : రబీ సీజన్‌లో అత్యధికంగా పప్పుశనగ పంట సాగు చేశారని, అయితే ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని ప్రభుత్వం పంట నష్ట పరిహారం ప్రకటించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలు సాగు చేసినా ఫలితం లేదన్నారు. వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగం నిర్వహించి ఎకరాకు కేవలం 2.5 క్వింటాలు దిగుబడి వచ్చిందని నివేదికలు ఇవ్వడం జరిగిందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి పరిహారం అందజేయాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, కృష్ణ వున్నారు.

వేమన పద్యాల్లో ఆత్మ జ్ఞానం

కృష్ణగిరి: సృష్టిలో అందరికీ వర్తించేలా, దైవ జ్ఞానం ఉండేలా వేమన తన పద్యాలు రాశారని త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవా సమితి జోన్ కమిటీ సభ్యులు నాగార్జున అన్నారు. మండల పరిధిలోని కర్లకుంట గ్రామంలో మంగళవారం వారు ఇంటింటికీ తిరిగి వేమన పద్యాల్లోని జ్ఞానం ఆవశ్యకతను వివరించారు. వేమన పద్యం వేయి విధముల అర్థాలు అమరి ఉండవచ్చు కానీ శోధించి చూస్తే అంతా ఆత్మ జ్ఞానమే ఉంటుందని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గుర్తించారన్నారు. కమిటీ సభ్యులు శివప్రసాద్, సుంకన్న, శివకుమార్, రామాంజి, శ్రీరాములు పాల్గొన్నారు.

'సూపర్' మోసంపై విస్తృత ప్రచారం చేయాలి

- ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి
- ఆస్పరి మండల కార్యకర్తల సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

చిప్పగిరి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ మోసాలపై నియోజక వర్గ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ, అనుబంధ సంఘాల్లో పదవులు పొందిన ఆస్పరి మండల నాయకులు, కార్యకర్తలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితి కారణంగా సూపర్ సిక్స్ అమలు చేయడానికి సాధ్యం కాదని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబే అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబుకు ఎన్నికల్లో హామీలు ఇచ్చేటప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా అని ప్రశ్నించారు. నవరత్నాలలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దే అన్నారు. అయితే సూపర్ సిక్స్ అంటూ సూపర్ మోసాలు చేసిన ఘనత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రి మాటల పై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్పరి మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, బాలయ్య శెట్టి, లక్ష్మన్న యదవ్, డీ అశోక్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆలూరు మండలంలోని కురుకుంద గ్రామంలో గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈరన్న స్వామి విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే విరూపాక్షి రూ. 25,000 విరాళంగా అందించారు.

రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

హాలహర్వి: మండలంలో రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన హాలహర్విలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. సమస్యలపై కార్యాలయంలోని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రీ సర్వే వేగవంతంగా నిర్వహించాలన్నారు. మండల సర్వేయర్, గ్రామ వార్డు సచివాలయం సర్వేయర్లు రీ సర్వేలో పాల్గొని ఎన్ని ఎకరాలు రీ సర్వే చేశారో ఎప్పటికప్పుడు రిపోర్టు పంపించాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజ్మాబాను, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, మండల సర్వేయర్ శ్రావణభార్గవి, వీఆర్వోలు లింగప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు, గొంతుక'ను విజయవంతం చేయండి

వెల్దుర్తి: ఫిబ్రవరి 7వ తేదీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు, గొంతుకల కార్యక్రమానికి మాదిగలందరూ తరలిరావాలని సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక సమితి నాయకులతో కలిసి పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమితి మండల అధ్యక్షుడు నాయకంటి దేవరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడంపై కేక్ కట్ చేసి, బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా , మండల నాయకులు ఐజయ్య, బజారు, గిడ్డయ్య, మోషే, సూర్యచంద్ర, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


పెద్దొడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ లూక్

కృష్ణగిరి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారు బరువు తక్కువగా లేకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ ఆదేశించారు. మండల పరిధిలోని తెగడొడ్డి, పెద్దొడ్డి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆయన సూపర్‌వైజర్ సుగుణమ్మతో కలిసి తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ వయస్సుకు తగ్గట్లు చిన్నారులు బరువు ఉండేలా చూసుకోవాలని సూచించారు. బరువుతోపాటు ఎత్తును కూడా తరచూ పరిశీలించుకోవాలన్నారు.


పత్తికొండలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ భవనం అద్దాలను ధ్వంసం చేసిన ఆకతాయిలు

అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌కు భద్రత కరువు

పత్తికొండ(తుగ్గలి): రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువుల బెడదను తప్పించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో దాదాపు రూ.70లక్షలకు పైగా ఖర్చు చేసి డాక్టర్ వైఎస్ఆర్ అగ్రిల్యాబ్‌ను నిర్మించింది. టెక్నికల్ అసిస్టెంట్‌గా ఒక ఏఓ, సహాయకులను నియమించింది. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు భద్రత కరువైంది. ఇటీవల కొందరు ఆకతాయిలు రాళ్లు విసిరి భవనం అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో భవనంలోని లక్షలు విలువచేసే పరికరాలకు భద్రత కరువైంది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆకతాయిలు అద్దాలు ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు టెక్నికల్ ఆఫీసర్ మునెమ్మ తెలిపారు.